# బలగం TV
BALAGAM

నిజమే బా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ గురువారం, 21 ఆగస్టు-2025 balagamtv100@gmail.com పేజీలు-4


**ముస్తాబద్ పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ**



2లో..

**బలగం టీవీ కథనానికి స్పందన**



2లో..

# భద్రాచలం దగ్గర గోదావరి ఉధృతి..



## మొదటి ప్రమాద హెచ్చరిక జారీ

హైదరాబాద్-ఆగస్టు 20 : భద్రాచలం దగ్గర గోదావరి ఉగ్రరూపం దాల్చింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పాటు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితో గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో గోదావరి నీటిమట్టం 43 అడుగులకు చేరింది.గోదావరి వద్ద ప్రవాహం భారీగా ఉంది. 9,40,345 క్యూసెక్కుల నీరు విడుదలవుతున్నది. గోదావరి వరద ప్రవాహం వల్ల స్నాన ఘట్టాల వద్ద చాలా మెట్లు వరద నీటిలో మునిగాయి. కల్యాణ కట్ట వరకు వరద నీరు వచ్చి చేరింది. ఈ నేపథ్యంలో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఈ క్రమంలో నదిలో స్నానాలు ఆచరించే భక్తులు ఎవరూ కూడా లోపలకు వెళ్లొద్దని సూచించారు. మరోవైపు పర్ణశాల వద్ద నార చీరల ప్రాంతం, సీతమ్మ విగ్రహం వరద నీటిలో మునిగాయి.మరోవైపు తుంగభద్ర ప్రాజెక్టు 26 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఇన్‌ఫ్లో 1,28,453 కాగా, ఔట్‌ఫ్లో 1,30,715 క్యూసెక్కులుగా ఉంది.

# రైతులపై లాఠీఛార్జ్..

## తీవ్రంగా ఖండించిన హరీశ్‌రావు

హైదరాబాద్ : మహబూబాబాద్ జిల్లా నర్సింహులుపేట మండలంలో ఎరువుల కోసం లైన్‌లో నిలుచున్న రైతు లపై లాఠీచార్జ్ చేసిన ఈ ప్రభుత్వ నిరంకుశత్వాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. వరంగల్ రైతు డిక్లరే షన్‌లో కాంగ్రెస్ పార్టీ చెప్పిందేంటి ఈరోజు చేస్తున్నది ఏమిటో ప్రజలు గమనిస్తున్నారు అని ఆయన చెప్పారు. సకాలంలో రైతులకు ఎరువులు ఇవ్వకుండా తీవ్ర ఇబ్బం దులు పెట్టడమే కాక వారిని పోలీసులతో కొట్టిం చడం సిగ్గుచేటు. కాంగ్రెస్ ప్రభుత్వ చేతకానితనం వల్లే ఈరోజు రైతులు రోడ్డుపైకి వచ్చి రాత్రి పగలు లైన్‌లో వేచి ఉండా ల్సిన దుస్థితి వచ్చింది. దీనికి ముక్కు నేలకు రాసి క్షమా పణ చెప్పవ లసింది పోయి రైతులపై లాఠీచార్జ్ చేయడం దుర్మార్గం అని హరీశ్ రావు మండిపడ్డారు. ఎరువుల కోసం రైతులు ఇంకా ఎన్ని అవస్థ లు పడాలి? ఎన్ని అవమానాలు ఎదుర్కోవాలి రేవంత్ రెడ్డి..? ముఖ్యమంత్రి స్వయంగా హెూం మంత్రిగా ఉంటూ పోలీసులతో రైతులపై లాఠీచార్జ్ చేయించడం అమానుషం. రేవంత్ రెడ్డి వెంటనే రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నామని హరీశ్‌రావు పేర్కొన్నారు.



## ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో బీఆర్ఎస్ మద్దతు పై తేల్చేసిన కేటీఆర్..!!



హైదరాబాద్-ఆగస్టు 20 ఉపరాష్ట్రపతి ఎన్నిక కేంద్రంగా తెలంగాణలో ఆసక్తి కర రాజకీయం కొనసాగుతోంది. ఇండియా బ్లాక్ నుంచి తెలంగాణ బిడ్డ జస్టిస్ సుదర్శన్ రెడ్డి పోటీ చేస్తున్నారు. ఎన్డీఏ నుంచి తమిళనాడు రాష్ట్రానికి చెందిన ప్రస్తుత మహారాష్ట్ర గవర్నర్ రాధాక్రిష్ణన్ పోటీలో ఉన్నారు. తెలంగాణ కు చెందిన సుదర్శన్ రెడ్డి పోటీ చేస్తుండటంతో.. పార్టీలకు అతీతంగా తెలుగు రాష్ట్రాల్లోని అన్ని పార్టీ లు మద్దతు ఇవ్వాలని సీఎం రేవంత్ కోరారు. దీని పైన స్పందించిన కేటీఆర్ ఈ ఎన్నికలో తమ వైఖరి ఏంటో స్పష్టం చేసారు. కొత్త అంశం తెర మీదకు తెచ్చారు.దేశ వ్యాప్తంగా ఆసక్తిని పెంచుతున్న ఉప రాష్ట్రపతి ఎన్నిక వేళ కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఇండియా కూటమి అభ్యర్ధిగా తెలంగాణకు చెందిన సుప్రీం మాజీ న్యాయమూర్తి సుదర్శన్ రెడ్డిని ప్రకటించారు. సీఎం రేవంత్ సూచన మేరకే సుదర్శన్ రెడ్డి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసినట్లు ప్రచారం సాగుతోంది. కాగా, ఏపీ - తెలంగాణలోని అన్ని పార్టీలు రాజకీయాలకు అతీతంగా.. రాజ్యాంగ పరిరక్షణ కోసం న్యాయకోవిదుడు అయిన సుదర్శన్ రెడ్డికి మద్దతు ఇవ్వాలని రేవంత్ అభ్యర్ధించారు. తెలంగాణ ప్రాంతానికి చెందిన సుదర్శన్ రెడ్డి విషయం లో బీఆర్ఎస్ మద్దతు ఇస్తుందా లేదా అనేది ప్రస్తుతం రాజకీయంగా హాట్ డిబేట్ గా మారింది. ఈ సమయంలోనే తమ విధానం ఏంటనేది కేటీఆర్ స్పష్టం చేసారు. ఉప రాష్ట్రపతి ఎన్నిక పైన కేటీఆర్ క్లారిటీ ఇచ్చారు. ఈ ఎన్నిక అంతా డ్రామాగా అభివర్ణించారు. బీఆర్ఎస్ ఏ కూటమిలోనూ భాగస్వామిగా లేదని చెప్పారు. మద్దతు కోసం తమను ఏ కూటమి నేతలు సంప్రదించలేదని తేల్చేసారు. రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన అభ్యర్ధిని ఖచ్చితంగా వ్యతిరేకిస్తామని కేటీఆర్ స్పష్టం చేసారు. తెలంగాణకు రెండు లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఎవరు ఇస్తారో వారికే మద్దతుగా నిలుస్తామన్నారు. తమకు మోదీ.. రాహుల్ బాస్ లు కాదని.. రాష్ట్ర ప్రజలే తమకు బాస్ లు అని స్పష్టం చేసారు. తెలంగాణ నుంచి బీసీ అభ్యర్ధిని ఎందుకు రేవంత్ ఉప రాష్ట్రపతి అభ్యర్ధిగా ప్రతిపాదించలేదని కేటీఆర్ కొత్త చర్చకు తెర తీసారు. బీసీలపై ప్రేమ మాటల్లోనే కానీ, చేతల్లో లేదా అని నిలదీసారు. ఇంకా ఎన్నికకు సమయం ఉందని.. పార్టీలో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని కేటీఆర్ తేల్చి చెప్పారు.

# సంఘటితమైతేనే సమస్యల పరిష్కారం

## దాస్యం వినయ్‌భాస్కర్



హనుమకొండ, ఆగస్టు 20 : వృత్తి కులాలు ముఖ్యంగా బీసీ కులాలు సంఘటితం కావలసిన సందర్భం ఏర్పడిందని, అందరూ సంఘటితమైతేనే సమస్యలు పరిష్కారమవుతాయని బీఆర్ఎస్ హను మకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. బుధ వారం హనుమకొండ జిల్లా స్వర్ణకారుల సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని బుధవారం హనుమకొండ రస్తాలోని వీనస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు.ముఖ్యఅతిథిగా హాజరైన వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. నేటి గ్లోబలైజేషన్‌లో కులవృత్తులు, చేతివృత్తులు కనుమరుగవుతున్నాయని, మల్టీ నేషనల్, మల్టీ బ్రాండింగ్ కంపెనీల కారణంగా చిన్న కుటీర పరిశ్రమల అస్తిత్వం దెబ్బతింటోందన్నారు. 2009 నుంచి 2023 వరకు ఎమ్మెల్యేగా ఉన్నంత కాలం చిరువ్యాపారులు, కులవృత్తిదారులు, స్థానిక వ్యాపా రస్తులకు అన్నివిధాల సహకరించానని వివరించారు. స్వర్ణకారుల వృత్తి ఎంతో నైపుణ్యాలతో, శ్రమతో సమ్మిళితమైన కళావృత్తి అని ఆయన కొనియాడారు. మల్టీ నేషనల్ కంపెనీల కారణంగా స్వర్ణకా రుల జీవనం, వ్యాపారం గడవడం ఇబ్బందవుతుందని, ఈ ప్రతికూ ల పరిస్థితుల్లో స్వర్ణకారులు అందరూ సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. వెండి, బంగారు ఆభరణాల తయారీలో ఆయా వృత్తి కులాల వారే ఉండాలని, ఆ వైపుగా సంఘం కృషి చేయాలని కోరారు.ఈ సందర్భంగా ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని శాలువా లతో ఘనంగా సన్మానించారు. సంఘం అధ్యక్షుడిగా పానుగంటి శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా మణింద్రనాథ్, కోశాధికారిగా సతీష్, ఉపాధ్యక్షులుగా బ్రహ్మం, రవి, రాజ్ కుమార్, ప్రసాద్, పూర్ణచందర్, గౌరవ సలహాదారులుగా కోటేశ్వర్ రావు, కమలాకర్, రవీంద్ర, చక్రపాణి, ముఖ్య సలహాదారుగా మధు సుధానాచారి, సహాయ కార్యదర్శులుగా రత్నాకర్, ప్రవీణ్, కార్యవర్గ సభ్యులుగా వాసు, వేణు, అనిల్, ప్రణయ్, రాజు, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, అరవింద్, కిరణ్, శ్రీనివాస్, గాయత్రి ఉన్నారు. ఈ కార్యక్రమంలో రాఘవా చారి, వెంకట స్వామి, సత్యనారాయణ, పెంటయ్యచారి, ఈశ్వర ప్రసాద్, కమలాకర్, కోటేశ్వర్ రావు, రాజేందర్, కృష్ణమాచారి, రమేష్, శ్రీనివాస్ చారి, జయ సేన, చక్రపాణి, భిక్షపతి, రవీంద్ర, జగన్, జయసాగర్ పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రభుత్వం తీపికబురు..

**• మేడారం మహాజాతర కోసం భారీస్థాయిలో నిధులు !**

హైదరాబాద్-ఆగస్టు 20 : మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతర.. ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన మేళాగా పేరుగాంచింది. ప్రతి రెండేళ్లకోసారి జరిగే మేడారం మహా జాతరలో దేశం నలుమూలల నుంచి, విదేశాల నుంచి కూడా లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. వచ్చే ఏడాది జనవరి చివర్లో కూడా ఈ జాతర ఘనంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జాతర నిర్వహణ కోసం భారీస్థాయిలో నిధులను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గిరిజన సంక్షేమ శాఖ రూ.150 కోట్లు మంజూరు చేయడం తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ నిధులను జాతర ఏర్పాట్లు, మౌలిక వసతులు, శాశ్వత నిర్మాణాల పనులకు వినియోగించనున్నారు. లక్షలాది మంది భక్తులు తరలి వచ్చే ఈ జాతరలో శుభ్రమైన త్రాగునీరు, విద్యుత్, రహదారులు, శానిటేషన్, పార్కింగ్, వైద్య సేవలు, భద్రతా ఏర్పాట్లు వంటి సౌకర్యాలను మరింత మెరుగుపరచాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇక ఇప్పటికే జాతర కు సంబంధించి ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఈ సారి గత సారి కంటే మరింత విస్తృతంగా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియో గంతో ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిఘా, అత్యవసర వైద్య కేంద్రాలు, ప్రత్యేక కంట్రోల్ రూమ్స్, ఉచిత బస్సు సదుపాయం, తాత్కాలిక వసతి గృహాలు వంటి అదనపు సౌకర్యాలు సైతం కల్పించనున్నారు. మంత్రి సీతక్క స్పందన.. ఈసారి మునుపెన్నడూ లేని రీతిలో నిధులు కేటాయిం చడం పట్ల మంత్రి సీతక్క ఆనందం వ్యక్తం చేశారు. సీఎం, డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ తీసు కున్న నిర్ణయానికి కృతజ్ఞతలు తెలిపారు. మేడారం జాతర ప్రతిష్టను దేశవ్యాప్తంగా, అంతర్జాతీయ స్థాయిలో మరింత పెంచే దిశగా ప్రభుత్వం చూపుతున్న కృషి అభినందనీయమని ఆమె పేర్కొన్నారు.

## ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు ఆరుగురు చిన్నారులు మృతి

మరావతి : కర్నూల్ జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. నీటి కుంటలో మునిగి ఆరుగురు చిన్నారులు మృతి చెం దిన ఘటన జిల్లాలోని ఆస్పరి మండలం చిగిలి గ్రామంలో జరిగింది. ఐదో తరగతికి చెందిన విద్యార్థులు నీటికుంటలో స్నానానికి దిగి ప్రమాదవశాత్తు మునిగి చనిపోయారు. తోటి చిన్నారులు స్థానికులకు సమాచారం అందించడంతో గ్రామస్థులు నీటి కుంటలో గాలింపు చర్యలు చేపట్టారు. చివరకుఆరుగురుమృతదేహాలు లభ్యమయ్యాయి. పోలీ సులకు సమాచారం అందిం చడంతో వారు గ్రామానికి చేరుకున్నారు.

## పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ.. శ్రీశైలం పది గేట్ల ఎత్తివేత

శ్రీశైలం, ఆగస్టు 20 : ఎగువ ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద పోటె త్తుతున్నది. జలాశయం 10 క్రస్ట్ గేట్లను 18 అడుగుల మేర ఎత్తి సాగర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల డ్యామ్ గేట్లద్వార 3,22,129 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 10,663 క్యూసె క్కులు.. సుంకేసుల నుంచి 1,33,100 క్యూసెక్కులు, హంద్రీ నుం చి 1,125 క్యూసెక్కుల నీరు విడుదలై సాయంత్రానికి 4,78,092 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో రిజర్వాయర్‌కు చేరుతోంది.అదే విధంగా కుడి, ఎడమ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ద్వారా 65,507 క్యూసెక్కులు, 10 గేట్లు ద్వారా 4,19,790 క్యూసెక్కులు మొత్తంగా 4,85,297 క్యూసెక్కులు అవుట్ ఫ్లో రిలీజ్ నాగార్జున సాగర్ వైపు వెళ్తుందని అధికారులు వివరించారు. జలాశయం పూర్తిస్థాయి నీటినిల్వ 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 881.80 అడుగులు ఉంది. పూర్తిస్థాయి నీటిసామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా ప్రస్తుతం 197.9120 టీఎంసీల నిల్వ ఉంది. జలాశయం గేట్ల ఎత్తుడంతో పెద్ద ఎత్తున పర్యాటకులు జలాశయం అందాలను చూసేందుకు తరలివస్తున్నారు. శ్రీశైలం కృష్ణమ్మ పరవళ్లు చూపరులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి.



# పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేత

- సామాజిక సేవలో ముందుంటున్న కచ్చకయల మహేష్




**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :** కొనరావుపేట(సుద్దాల): సుద్దాల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకుక్రీడా దుస్తులు సామాజిక సేవకర్త కచ్చకాయల మహేష్అం దించడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు మాట్లాడుతూ సుమారుగా 15000 రూపాయలు విలువ గలిగిన క్రీడా దుస్తులను పాఠశాలకు అందించిన గచ్చకాయల మహేష్ కి ధన్యవాదాలు తెలిపారు గత కొన్ని సంవత్సరాలుగా పూర్వ విద్యార్థి అయినా మహేష్ ఈ పాఠశాలకు ఏ సమస్య వచ్చిన, అడిగిన వెంటనే కాదనుకుంటా అనేక సహకారలు అందిస్తున్నారని అన్నారు.. గతంలో కూడా స్కూల్ డ్రెస్సులకు 30 వేల రూపాయలు క్రీడా పోటీలకు మూడు తాతలు 20వేల రూపాయలు కలిగిన క్రీడా బహుమతులను కూడా పాఠశాలకు అందించడం జరిగిందని ఇంతటి సహకారం చేస్తున్న కచ్చ కాయల మహేష్ కి ప్రత్యేక ధన్యవాదాలు అని తెలిపారు. అలాగే పూర్వ విద్యార్థులు, యువకులు మాట్లాడుతూ కచ్చకాయల మహేష్ చిన్ననాటి నుంచి సామాజిక సేవలు ముందుంటున్నారని గ్రామంలో కుడా ఏ సమస్యా వచ్చిన తనకు తోచిన విధంగా అనేక సహకారాలు అందిస్తున్నారని ఇలాంటి వ్యక్తి మాకు మరియు నేటి యువతకు ఆదర్శమని అన్నారు మనకు తోచిన సహాయాన్ని అందిస్తూ గ్రామాన్ని, పాఠశాలను, అభివృద్ధి పరచుకోవాలన్నటువంటి ఆలోచన కలిగిన మహేష్ కి గ్రామ యువత తరఫున ధన్యవాదాలు తెలిపారు. అలాగే సామాజిక సేవాకర్త మహేష్ మాట్లాడుతూ నేను చదువుకున్న పాఠశాలలో గతంలో నేను విద్యార్థి గా ఉన్నపుడు మాకు టీచర్ల కొదవ పిఈటి కొదవ ఉండేది అని క్రీడలో రాణించాలన్న క్రీడా దుస్తులు కూడా లేనటువంటి పరిస్తితి ఉండేది అని హా సమయంలో మాకు ఎంత ఆశ ఉన్నప్పటికీ క్రీడలలో వెనుకబడ్డమని అన్నారు, అలాంటి పరిస్థితులు నేటి పిల్లలకు రాకూడదని ఉద్దేశం తో పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులు, క్రీడల్లో పోటీ పడాలంటే మానసిక ధైర్యం డ్రెస్ కోడ్ అని అలాంటి డ్రెస్ కోడ్ వల్ల ఆత్మస్థర్యంతో క్రీడల్లో ధైర్యంగా రాణిస్తారాన్న ఉద్దేశంతో క్రీడా దుస్తులను అందించానని, రాబోయే రోజుల్లో చదువులతోపాటు క్రీడల్లో మంచి విజయాలు సాధించి పాఠశాలకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు%ౌ% ఎవరి ఆర్థిక పరిస్థితులు ఎలా ఉన్నా చదివి ఒకటి ఉంటే దేనినైనా సాధించగలమని దానికి నిదర్శనమే ఇదే పాఠశాలలో చదివి ప్రధాని మొది చాయిపే చర్చలో పాల్గొన్న అలువల సాయి తేజ ఒక ఉదాహరణ అని అన్నారు.. కాబట్టి విద్యార్థిని విద్యార్థులు చదువులో రాణిస్తే దేనినైనా సాధించగలుతారని అన్నారు. ఇకముందు కూడా పాఠశాలకు అభివృద్ధి కొరకు ఎలాంటి సహాయ సహకారాలు అందించడానికి అయినా నేను ముందుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు మంజుల దేవి, పి ఈ టి సంతోష్, అదేవిధంగా ఉపాధ్యాయ బృందం విద్య కమిటీ చైర్మన్ మాజీ విజయ్, బి ఆర్మీ అధ్యక్షులు దొబ్బల ప్రవీణ్, ప్రతినిధి వంగాల భూమేష్, తెలంగాణ పవర్ యూత్ అధ్యక్షులు సింగం నరేందర్, కాదాసు నరసయ్య, ఎర్రవెల్లి మహేందర్, బొద్దు మధు, దొబ్బల నరేష్, కచ్చకాయల పరుశురాములు, రామోజీ సాయి, ఎగదండి సుధీర్,.. తదితరులు పాల్గొన్నారు..

## ఇందిరమ్మ గృహాలకు భూమి పూజా



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :** తంగళ్ళపల్లి మండల కేంద్రంలో ఇందిరమ్మ గృహాల కోసం కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు జలగం ప్రవీణ్ గృహాల నిర్మాణంకై భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా తాను మాట్లాడుతూ అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయడం జరిగిందని ఇప్పటివరకు గ్రామం లో 50 ఇళ్ల వరకు నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. మిగతా వాటిని కూడా త్వరలో నిర్మాణం చేపట్టేలా చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు ప్రవీణ్ టోనీ,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నేరల్ల నరసింగం గౌడ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు లింగాల భూపతి, రాపల్లి ఆనందం సుద్దాల శ్రీనివాస్, వాసు, కరుణాకర్ గౌడ్, మాజీ ఉప సర్పంచ్ పెద్దూరి తిరుపతి, చుక్క శేఖర్, మాజీ వార్డు సభ్యులు బండి పరుశురాం, సామల రమేష్ గ్రామ పంచాయతీ కార్యదర్శి సమీర్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా మహిళా కాంగ్రెస్ సేవా



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :** భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకొని, నేషనల్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లంబా మరియు రాష్ట్ర అధ్యక్షురాలు సునీత రావు ఆదేశాను సారం, రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల కొత్త బస్టాండ్ ప్రాంతంలో ప్రత్యేక సేవా కార్యక్రమం నిర్వహించబడింది. జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాముని వనిత-నలినీకాంత్ నేతృత్వంలో ఈ కార్యక్రమంలో ఉచితంగా సానిటరీ ప్యాడ్స్ పంపిణీ చేయడం జరిగింది. మహిళా కాంగ్రెస్ మెంబర్షిప్ ద్వారా సమకూరిన నిధులతో సానిటరీ నాప్కిన్స్ మిషన్ కొనుగోలు చేసి, మహిళలకు ఉపాధి కల్పిస్తూ, ఉత్పత్తయిన నాప్కిన్లను ఉచితంగా అందజేయడం ఎంతో సత్కార్యంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు మడుపు శ్రీదేవి, టౌన్ అధ్యక్షురాలు మరియు మార్కెట్ కమిటీ చైర్మన్ వేముల స్వరూప, జిల్లా జనరల్ సెక్రటరీ కోడం అరుణ, వైస్ ప్రెసిడెంట్ సామల రోజా, కోడం సుధా, సాగాల లత, మార్గం మంజుల మరియు అనేకమంది మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

## హరిత సేనలో మొక్కలు నాటిన మాజీ సర్పంచ్ చిందం రమేష్



**బలగం టీవీ, బోయినిపల్లి :** గ్రీన్ ఇండియా ఛాలెంజ్ హరిత సేన వ్యవస్థాపకులు జోగినిపల్లి సంతోష్ కుమార్ చేపట్టిన హరిత సేనలో రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం తడగొండలో మాజీ సర్పంచ్ చిందం రమేష్ తన జన్మదినం సందర్భంగా మున్నూరు కాపు సంఘం భవనం ఆవరణలో 22 మొక్కలు నాటరు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ: మాజీ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ చేపట్టిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో మున్నూరు కాపు సంఘం భవనం ఆవరణలో 22 మొక్కలు నాటడం జరిగిందని, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని, భావితరాలకు భవిష్యత్తు ను అందించాలని, ప్రయత్నం చేస్తున్న మాజీ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ కి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు అధ్యక్షులు బుర్ర రాజు, ప్రధాన కార్యదర్శి, సింగరి రమేష్ చిచ్చుల భూమయ్య,పొన్నం తిరుపతి, గోగురి తిరుపతి, ఎర్ర రవి, చేపూరి మహిపాల్, సింగరి మధు,బొడ్డు రమేష్,వంచ వీరారెడ్డి, అయిందల లక్ష్మరెడ్డి, అక్కనేపల్లి కర్ణాకర్,చిందం శ్రీను,చిందం శేషు,శీలం తిరుపతి రెడ్డి, చేపూరి గణేష్,చేపూరి సుధాకర్, హరిత సేన సభ్యులు కమల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రహీంఖాన్ పేట మోడల్ స్కూల్ జువాలజీ ఉపాధ్యాయురాలికి పి.హెచ్‌డీపట్టా



**బలగం టీవీ, ఇల్లంతకుంట :** ఇల్లంతకుంట మండలం TGMS రహీంఖాన్ పేట్ స్కూల్లో జువాలజీ ఉపాధ్యాయురాలుగా పని చేస్తున్న రాగమాలికకు Ph.D పట్టా లభించింది. మంగళవారం హైదరాబాదులో జరిగిన ఓయూ స్నాతకోత్సవ కార్యక్రమంలో గవర్నర్ విష్ణు దేవ్ శర్మ, ఇస్రో చైర్మన్ వినారాయణ, విసి చేతుల మీదుగా ఆమె ఈ పట్టాను అందుకున్నారు. Insect pest management in Tactona grandis అనే అం శంపై ప్రొఫెసర్ ఎం.మాధవి పర్యవేక్షణలో పరిశోధనలు చేసి ఆమె ఈ పట్టాను పొందారు. కళాశాల ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

## పేరెంట్స్ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



**బలగం టీవీ, తంగళ్ళపల్లి :** బద్దెనపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు తల్లిదండ్రుల కమిటీ ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్ గుగ్గిళ్ళ మమత, వైస్ చైర్మన్ బంటు బాబు, ప్రధాన కార్యదర్శి ఏనుగుల రమణ, కార్యదర్శి కులేరి కిషోర్ కుమార్, కోశాధికారి కొంపెల్లి శ్యామ్, పబ్లిసిటీ గుడిసె గంగయ్య, కమిటీ సభ్యులు కనకయ్య, లచ్చయ్య, ప్రభాకర్, దేవదాస్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విద్యార్థులకు అన్ని విధాల సదుపాయాలు కల్పించే విధంగా ఏర్పాటు చేసి పాఠశాల అభివృద్ధికి సహకరిస్తామని ఈ సందర్భంగా తెలిపారు.

## ఉస్మాన్ సాగర్ రెండు గేట్లు ఎత్తివేత



**హైదరాబాద్-ఆగస్టు 20** ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలతో జంట జలాశయాలకు భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది. దీంతో గండిపేట మండల తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఉస్మాన్‌సాగర్ రెండు గేట్లు ఒక ఫీట్ మేర ఎత్తి మూసీలోకి నీటిని వదదిలారు. గండిపేట జలాశయం ఎఫ్‌టిఎల్ మొత్తం 1790 ఫీట్లు కాగా ప్రస్తుతం నీటి మట్టం 1789 ఫీట్లకు చేరుకుంది. వెంటనే స్పందించిన అధికారులు గేట్లను ఎత్తి నీటిని మూసీలోకి వదిలారు. కాగా హిమాయత్‌సాగర్ జలాశయం ముందస్తుగా నీటి మట్టానికి చేరుకోవడంతో గత కొన్ని రోజులుగా గేట్లను ఎత్తి నీటిని ఈసీ నదిలోకి వదులుతున్న విషయం తెలిసిందే. ఇదిలా ఉంటే ఈ సంవత్సరంలో మొదటిసారిగా ఉస్మాన్‌సాగర్ గేట్లు బుధవారం ఎత్తి మూసీలోకి 1600 క్యూసెక్కుల నీటిని వదిలారు. అధికారుల అప్రమత్తం జంట జలాశల నీటిని మూసీ నదిలోకి వదలడంతో మూసీ, ఈసీ నదుల పరివాహక ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ నది వైపు ఎవరు వెళ్లకుండా తగిన చర్యలు చేపట్టారు.

# ముస్తాబద్ పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

- జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ఐపీఎస్.
- గణేష్ చవితి సందర్భంగా నిబంధనలు విరుద్ధంగా డీ.జే లు ఏర్పాటు చేసే వారిపై కఠిన చర్యలు.
- వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు పాటించాలి.






**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :** బుధవారం రోజున జిల్లా ఎస్పీ ఆకస్మికంగా ముస్తాబద్ పోలీస్ స్టేషన్ తనిఖీ చేసి పోలీస్ స్టేషన్ ల పరిసరాలను, స్టేషన్ పరిధిలో నమోదు అవుతున్న, నమోదైన కేసుల వివారలు, స్టేషన్ రికార్డ్ లు తనిఖీ చేసి కేసుల దర్యాప్తు విషయంలో అధికారులు అలసత్వం వహించవద్దని, ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా బాధితుల పిర్యాదుల పట్ల తక్షణమే స్పందించాలని, ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో ఉండాలని, పెట్రోలింగ్ సమయంలో పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లను ప్రతి రోజు తనిఖీ చేయా లని ఆదేశించారు. గణేష్ మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా పోలీస్ శాఖ వారు రూపొందించిన https://policeportal.tspolice.gov.in పోర్టల్ లో దరఖాస్తు చేసుకోవలని సూచించారు. గణేష్ చవితి సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా డీ.జే లు ఏర్పాటు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, డి.జే యజనులకు కౌన్సెలింగ్ నిర్వహించాలని అవసరం అయితే బైండోవర్ చేయాలని ఆదేశించారు. వర్షాల దృష్ట్యా ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా ప్రణాళికా బద్దంగా పని చేయాలని అన్నారు. వర్షాల ప్రభావం, వరద పరిస్థితిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై ప్రజలను ఎప్పటికప్పుడు చైతన్య పర్చాలని, ప్రజలు కూడా వర్షాల దృష్ట్యా అప్రమత్తంగా ఉంటూ తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. అంతకుముందు గంబీరావుపేట, లింగన్నపేట గ్రామాల మధ్య వరద ప్రవాహం ఎక్కువ ఉండి రాకపోకలకు ఇబ్బంది తలెత్తగా స్థానిక ఎస్.ఐ రమాకాంత్ తో కలసి పరిశీలించి అటు వైపు ఎవరు పోకుండా ఇరువైపులా బారికేడ్లు, సూచిక బోర్డు ఏర్పాటు చేయాలని, అవసరం మేరకు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎస్పీ వెంట ఎస్.ఐ గణేష్, సిబ్బంది ఉన్నారు.



# బలగం టీవీ కథనానికి స్పందన

- కాంగ్రెస్ నాయకుడు యం. రాజు ఆధ్వర్యంలో గుంతల పూడ్చివేత

**బలగం టీవీ, ఇల్లంతకుంట :**
ఇల్లంతకుంట నుండి వెంకట్రావుపల్లె వైపు వెళ్ళే రహదారి లో ఏర్పడిన గుంతలను, అరగజం గుంతలు..
ఆదమరిస్తే ఆసుపత్రి కే అన్న కథనానికి మండల కాంగ్రెస్ నాయకుడు యం.రాజు ఆధ్వర్యంలో నాయకులు స్పందించి వెంటనే మొరం తెప్పించి పోసి గుంతలను పూడ్చారు. అటువైపు గా నిత్యం వెళ్ళే ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.
ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిట్టీ ఆనంద రెడ్డి, గొడుగు నర్సయ్య, కార్తిక్, నరేష్ తదితరులు ఉన్నారు.




## 22న తెలంగాణ బంద్

**హైదరాబాద్-ఆగస్టు 20 :** మార్వాడీల దాడులకు వ్యతిరేకంగా ఈ నెల 22న తెలంగాణ బంద్ కు పిలుపునిస్తున్నట్లు ఓయూ జేఏసీ ప్రకటించింది. సోమవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ వద్ద ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి మాట్లాడుతూ.. రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల నుంచి వలస వచ్చిన మార్వాడీలు తెలంగాణ కుల వృత్తులను దెబ్బతీస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రజ లను మార్వాడీలు దోచుకుంటున్నారని మండిపడ్డారు. ఈ సందర్భంగా మార్వాడీ గో బ్యాక్ అంటూ జేఏసీ నేతలు నినాదాలు చేశారు.

## ఓయూ పరిధిలో ఎంఎంఎస్ పరీక్షా ఫీజు స్వీకరణ

**హైదరాబాద్-ఆగస్టు 20 : :** ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని మాస్టర్ ఆఫ్ మేనేజ్‌మె ంట్ స్టడీస్ (ఎంఎంఎస్) పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎంఎస్ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును వచ్చే నెల 1వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

## తిరుమలలో సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 2 వరకు బ్రహ్మోత్సవాలు..

### ఏర్పాట్లపై ఈవో సమీక్ష



**తిరుమల :** తిరుమలలో ఈ ఏడాది వార్షిక బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 2 వరకు జరుగను న్నాయని టీటీడీ ఈవో జె. శ్యామలారావు తెలిపారు. అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్పీ హర్షవర్ధన్ రాజుతో పాటు టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణలతో కలిసి సోమ వారం అన్నమయ్య భవనంలో సమీక్షా సమావేశం నిర్వహిం చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సెప్టెంబర్ 24న బ్రహ్మోత్సవాల తొలి రోజు పట్టు వస్త్రా లను సమర్పిస్తారని వివరించారు. సెప్టెంబర్ 28న గరుడ సేవ , అక్టోబర్ 2న చక్రస్నానం కార్యక్రమాలు జరుగు తాయని వెల్లడిం చారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా వచ్చే రద్దీని ముందుగా అంచనా వేసి ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ఆదేశించారు. అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద వాహన రాకపోకలను అంచనా వేసేందుకు టెక్నాలజీ సాయం తీసుకోవాలని సూచించారు. ఎక్కువమంది భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేలా చర్యలు చేపట్టాల న్నారు. ఆలయం, గ్యాలరీల్లో భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో జిల్లా పోలీసులతో సమన్వయం తో భద్రత, బందోబస్తు ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఈవో సూచిం చారు. తిరుమలలో పార్కింగ్ స్థలాలను ఎంపిక చేసి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో టీటీడీ ఎఫ్ఏ అండ్ సీఏవో బాలాజీ, సీఈ సత్యనారాయణ, ఏపీఎస్ ఆర్టీసీ ఆర్ఎం జగదీష్, ఇతర టీటీడీ, పోలీసు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఏపీలో మొదలైన ఫ్రీ బస్సు కష్టాలు..!



**అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం ఇటీవల ప్రారంభిం చిన ఉచిత బస్సు పథకం, మహిళలకు ఆర్థికంగా ఊరటనిచ్చినప్పటికీ, కొన్ని చోట్ల అసౌకర్యాలకు దారితీస్తోంది. పథకం ప్రారంభమైన మూడు రోజులు ప్రశాంతంగా సాగగా, తాజాగా బస్సుల్లో సీట్ల కోసం మహిళల మధ్య వాగ్వాదాలు, ఘర్షణలు మొదలయ్యాయి. విజయవాడ నుంచి ఏలూరు వెళ్తున్న ఓ బస్సులో సీటు విషయంలో ఇద్దరు మహిళలు వాదులాడుకున్నారు. ఈ వాదనలు ముదిరి పరస్పరం బూతులు తిట్టుకు నేంత వరకు వెళ్లాయి. కొట్టుకునేంత పని జరగగా, తోటి ప్రయాణికులు జోక్యం చేసుకుని సర్దిచెప్పడంతో గొడవ సద్దుమణిగింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ సంఘటనపై నెటిజన్లు భిన్న రకాలుగా స్పందించారు. తెలంగాణలో ఉచిత బస్సు పథకం ప్రారంభమైనప్పుడు ఇలాంటి గొడవలే జరిగాయని గుర్తు చేస్తూ, ఇప్పుడు ఏపీలో కూడా "మహిళల యుద్ధాలు" మొదలయ్యాయని కొందరు కామెంట్స్ చేశారు. రాబోయే రోజుల్లో ఇలాంటి సంఘటనలు మరిన్ని చూసే అవకాశం ఉందని పోస్టులు పెట్టారు. ఉచిత బస్సు పథకం వల్ల మహిళలకు ప్రయాణ సౌకర్యం పెరిగినా, బస్సుల్లో రద్దీని, అసౌకర్యాన్ని నివారించడానికి తగిన ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉందని ఈ ఘటన నిరూపిస్తోంది.

## 'లోక్‌సభను వెంటనే రద్దు చేయాలి':

### ఈసీపై 'ఇండియా' కూటమి ఆగ్రహం




**అమరావతి, :** 'ఇండియా' కూటమి సోమవారం నాడు ఎన్ని కల సంఘంపై తీవ్రస్థాయిలో విరుచుకు పడింది. ఎన్నికల సంఘం (ఈసీ) పక్షపాతంగా వ్యవహరిస్తోందని, ఇటీవల జరిగిన ఎన్నికల్లో అవకతవకలకు పాల్పడిందని ఆరోపించింది. ముఖ్యంగా బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు హడావిడగా ఓటర్ల జాబితాలో మార్పులు చేయడంపై కూటమి నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియాలో జరిగిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్, టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా, ఎస్పీ నుంచి రాంగోపాల్ యాదవ్, ఆర్‌జేడీ నుంచి మనోజ్ ఝా, ఆప్ నుంచిసంజయ్‌సింగ్ తదితర సీనియర్ నాయకులు పాల్గొ న్నారు. లోక్‌సభ రద్దుచేయాలని మహువా మొయిత్రా డిమాండ్ తృణ మూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా ఎన్నికల సంఘం తీరుపై ఆగ్రహంవ్యక్తం చేస్తూ..గతంలో ఎన్నికల సంఘంలో పనిచేసిన అధి కారులపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం రూపొందించినఓటర్ల జాబితాలో మోసపూరితమైనవని ఆమె ఆరోపి ంచారు. పరిస్థితిని సరిదిద్దడానికి 'లోక్‌సభను వెంటనే రద్దు చేయాలి' అని ఆమె సంచలన ప్రకటన చేశారు. నిష్పక్షపాతంగా వ్యవహరించడం లేదు: గౌరవ్ గొగోయ్ కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ మాట్లాడుతూ.. మహారాష్ట్ర, కర్ణాటక ఎన్నికల్లో జరిగిన అవకతవకలను ఎన్నికల సం ఘంపట్టించుకోవడం లేదని ఆరోపించారు. "మహారాష్ట్రలో ఓటర్ల సంఖ్య పెరగడంపైనా, మహాదేవపురలో ఓటర్ల జాబితాలో తేడా లపైనా, వీడి యో డేటా తొలగింపుపైనా ఈసీ మౌనం వహిస్తోంది. ఎన్ని కల సం ఘంఅధికారులు పక్షపాతంతో వ్యవహరిస్తున్నారు. విపక్షం చేసి న ఫిర్యా దులను పరిశీలించడం లేదు. అనిగౌరవ్ గొగోయ్ ఆరోపించాడు. బీజేపీ అధికారప్రతినిధిలా ఈసీ అరవింద్ సావంత్ శివసేన (యూబీటీ) నాయ కుడు అరవింద్ సావంత్ కూడా ఎన్నికల సంఘంపై తీవ్ర వ్యాఖ్య లు చేశారు. "ప్రధాన ఎన్నికల కమిషనర్ తీరు చూస్తుంటే, ఆయన బీజే పీ ప్రతినిధిగా వ్యవహరిస్తున్నట్లు అనిపిస్తోంది"అని సావంత్ అన్నారు. మొత్తంగా,'ఇండియా' కూటమి నాయకులు ఎన్నికల సం ఘంపై తమ అసంతృప్తిని,ఆగ్రహాన్నివ్యక్తంచేశారు. ఈసీనిష్పక్షపాతంగా వ్యవహా రించ డంలేదని, ఇది ప్రజాస్వామ్యానికిప్రమాదకరమని వారు హెచ్చరించారు.

# వాహనదారులకు షాక్.. ఇకపై వాహనాలు కొంటే ఆ ట్యాక్స్ మోత మోగుడే!



**అమరావతి,ఆగస్టు-17:** తెలంగాణ ప్రభుత్వం వాహనదారులకు భారీ షాక్ ఇచ్చిన విషయం తెలిసిందే. తెలంగాణ సర్కార్ వాహనాలపై లైఫ్ టాక్స్‌ను గణనీయంగా పెంచింది. ఈ కొత్త రేట్లు ఆగస్టు 14 నుండి అమల్లోకి వచ్చాయి. రవాణా, రోడ్లు-భవనాల శాఖ జారీ చేసిన జీఓ నెం. 53 ద్వారా మోటార్ వాహనాల పన్ను చట్టం, 1963లోని షెడ్యూల్స్‌లో మార్పులు చేసినట్టు సమాచారం. తెలంగాణాలో పెరిగిన లైఫ్ ట్యాక్స్ దీని ప్రకారం టు వీలర్, త్రీ వీలర్, ఫోర్ వీలర్ నాన్-ట్రాన్స్‌పోర్ట్ వాహనాలకు పెరిగిన లైఫ్ టాక్స్ వర్తిస్తుంది. ఇది పేద మధ్యతరగతి వారిపైన అదనపు భారంగా చెప్పవచ్చు. ప్రభుత్వానికి ఆదాయం కోసం రేవంత్ సర్కార్ తాజా నిర్ణయం ప్రకారం, రూ. 50 వేలలోపు ధర కలిగిన ద్విచక్ర వాహనాలపై 9 శాతం పన్ను విధిస్తారు. లైఫ్ ట్యాక్స్ టారిఫ్ లు ఇలా రూ. 50 వేల నుంచి రూ. 1లక్ష వరకు ఉన్న బైకులపై 12శాతం పన్ను యథాతథంగా కొనసా గుతుంది. ఈ పన్నులో ఎటువంటి మార్పు లేదు. రూ. 1 లక్ష నుంచి రూ. 2 లక్షల మధ్య ఉన్న వాహనాలపై 15 శాతం, రూ. 2లక్షలకు పైబడిన వాటిపై 18శాతం లైఫ్ టాక్స్ వసూలు చేస్తారు. ఇదే సమయంలో విద్యుత్తో నడిచే ఈవి వాహనాల పైన ఎలాంటి పన్నులు విధించడం లేదు. నాన్ ట్రాన్స్ పోర్ట్ వాహనాలపైనా భారీగా లైఫ్ ట్యాక్స్ ప్రభుత్వం మరింత ఆదాయాన్ని సమకూర్చుకోవడం కోసం తెలంగాణ సర్కార్ వాహనదారులపైన లైఫ్ టాక్స్ లో మార్పులు చేర్పులు చేసింది. ఇక తాజాగా మార్చిన లైఫ్ టాక్స్ ప్రకారం ఒక లక్ష పదివేల రూపాయల విలువైన బైక్ కు ఇంతకుముందు 13200 పన్ను చెల్లించగా, ఇప్పుడు ప్రభుత్వ తాజా నిర్ణయంతో 16,500లైఫ్ టాక్స్ అవుతుంది. నాన్ ట్రాన్స్పోర్ట్ ఫోర్ వీలర్ వాహనాలపై కూడా ప్రభుత్వం లైఫ్ టాక్స్ ను భారీగా పెంచింది. కొన్ని కేటగిరీలలో లైఫ్ ట్యాక్స్ ఇలా ఐదు లక్షల రూపాయల లోపు కార్ల పైన 13 శాతం, 10 లక్షల నుంచి 20 లక్షల మధ్య కార్ల పైన 18 శాతం పన్నును విధించింది. కంపెనీలకు పేరుతో కొనుగోలు చేసే వాహనాలకు, రెండో వాహనాలపై మరింత పన్ను విధిస్తారు. కొన్ని కేటగిరీలలో ఇది 25 శాతం వరకు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో కార్ల కొనుగోలుపై అదనపు భారం అయితే విద్యుత్ వాహనాలకు మినహాయింపు ఇచ్చిన ప్రభుత్వం, విద్యుత్ వాహనాలకు మినహాయింపును డిసెంబరు 31 2026 వరకు కొనసాగించనుంది. ఇదిలా ఉంటే ప్రభుత్వ తాజా నిర్ణయంతో కార్ల మీద అదనంగా 20 వేల నుంచి 25 వేల రూపాయల వరకు భారం పడే అవకాశం ఉందని చెబుతున్నారు. ఆటోమొబైల్ రంగంలో పనిచేసే ప్రముఖులు ఈ పెంపు మంచిది కాదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## తిరుమల శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలపై తీపి కబురు!



**అమరావతి, :** కలియుగ ప్రత్యక్షదైవం, దేవదేవుడు కొలువైన తిరుమలలో ఈ ఏడాది వార్షిక బ్రహ్మోత్స వాలకు అప్పుడే ఏర్పాట్లు మొదలయ్యాయి. సెప్టెంబర్ 24నుండి అక్టోబర్ 2వరకు తిరుమల శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో టీటీడీ ఈవో జె. శ్యామలారావు, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్పీ శ్రీ హర్షవర్ధన్ రాజులతో పాటు టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణలతో కలిసి అన్నమయ్య భవనంలో సమీక్ష నిర్వహించారు. సెప్టెంబర్ 24న స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకురానున్న చంద్రబాబు ఈ సమీక్ష సమావేశంలో పలు కీలక నిర్ణయాలను తీసుకున్నారు. తిరుమల శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబంధించి జరిగే కార్యక్రమాలను, వాటిని ఏ విధంగా నిర్వహిం చాలి అనే దానిపైన సంబంధిత సిబ్బందికి ఆదేశాలిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు సెప్టెంబర్ 24వ తేదీన బ్రహ్మోత్సవాలు తొలి రోజు పట్టు వస్త్రాలను సమర్పిస్తారని పేర్కొన్నారు. సెప్టెంబర్ 28వతేదీన స్వామివారికి గరుడ సేవ, అక్టోబర్ 2న చక్రస్నానం నిర్వహిస్తారని తెలిపారు. వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు, ముందు జాగ్రత్త చర్యలపై ఆదేశాలు శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా రద్దీ నిర్వహణకు రద్దీని ముందుగా అంచనా వేసి ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని టిటిడి ఈవో ఆదేశాలు జారీ చేశారు. అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద వాహన రాకపోకలను అంచనా వేసేందుకు టెక్నాలజీ సాయం తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కువమంది భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేలా చర్యలు చేపట్టాలని ఈవో ఆదేశిం చారు. ఆలయానికి వచ్చే భక్తుల భద్రత విషయంలో కూడా తగు చర్యలు చేపట్టాలన్నారు. ఈ అంశాలపై దృష్టి పెట్టాలన్న ఈవో ఆలయంలో, గ్యాల రీల్లో, భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో జిల్లా పోలీసులతో సమన్వ యంతో భద్రత, బందోబస్తు ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఈవో ఆదేశి ంచారు. తిరుమలలో పార్కింగ్ స్థలాలను ఎంపిక చేసి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబంధించి ఆలయ కైంకర్యాలు, వాహ నసేవలు, ఇంజినీరింగ్ పనులు, వసతి గృహాలు తదితరాలపై చర్చించారు.

## ఉండవల్లి ఇంట్లో వైసీపీ మాజీలు ..!

### సీక్రెట్ చర్చలు..! ఏం జరుగుతోంది ?



**అమరావతి, :** ఏపీలో కూటమి సర్కార్ ఏడాది పాలన పూర్తి చేసుకుంది. అదే సమయంలో వైసీపీని టార్గెట్ చేసేందుకు అందివచ్చిన అవకాశాల్ని వాడుకుంటూ వైసీపీని టార్గెట్ చేస్తోంది. ముఖ్యంగా మద్యం స్కాంలో ఇప్పటికే సిట్టింగ్ ఎంపీ మిథున్ రెడ్డిని అరెస్టు చేసి జైలుకు పంపారు. త్వరలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ ను కూడా అరెస్టు చేస్తారన్న ప్రచారాన్ని తెరపైకి తెస్తున్నారు. ఇలాంటి సమయంలో వైసీపీ మాజీ ప్రజాప్రతి నిధులు ఇవాళ రాజమండ్రిలో మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ తో భేటీ అయ్యారు. రాజమహేంద్రవరంలో మాజీ ఎంపీ ఉండవల్లి అరుణకుమార్‌ను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యేలు కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, అనంత వెంకటరామిరెడ్డి, వైసీపీ నాయకుడు సుగవాసి బాలసుబ్రమణ్యం తదితరులు మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. మద్యం కుంభకోణం కేసులో రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఉన్న పార్టీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని ములాఖత్‌లో కలిసి పరామర్శించేందుకు నగరానికి వచ్చిన వారు ఉండవల్లి నివాసానికి వెళ్లారు. కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీ అయిన ఉండవల్లి అరుణ్ కుమార్ ను రాజకీయ మేధావిగా పేరుంది. కొన్నేళ్లుగా రాజకీయాలకు దూరంగా ఉంటున్నా రాజకీయ వ్యాఖ్యలు చేయడంలో మాత్రం ఆయన చురుగ్గానే ఉంటున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులను ఉండవల్లితో వైసీపీ మాజీ ప్రజాప్రతినిధులు చర్చించి ఉంటారని తెలుస్తోంది. అలాగే కూటమిని ఎదుర్కోవడానికి అనుసరించాల్సిన వ్యూహాలపై సలహాలు కూడా కోరి ఉండొచ్చని సమాచారం. వాస్తవానికి గతంలో వైసీపీకి అనుకూలంగా పలు వ్యాఖ్యలు చేసిన ఉండవల్లి అరుణ్ కుమార్.. జగన్ కు కూడా సలహాలు ఇచ్చారు. ఆయన తండ్రి రాజశేఖర్ రెడ్డికి అత్యంత సన్నిహితుల్లో ఒకరైన ఉండవల్లి అంటే ఇప్పటికీ వైసీపీలో చాలా మందికి ఎంతో గౌరవం ఉంది. అలాగే ప్రస్తుతం కూటమి సర్కార్ పనితీరుపైనా ఉండవల్లి అసంతృప్తిగానే ఉన్నారు. ఈ నేపథ్యంలో వైసీపీ మాజీలు ఉండవల్లిని కలవడం ప్రాధాన్యం సంతరిచుకుంది. పైకి మాత్రం ఇది మర్యాదపూర్వక భేటీయేనని చెప్తున్నారు.

## ఉపరాష్ట్రపతి రేసులో వైసీపీ సపోర్ట్.. బీజేపీ వ్యూహానికి బలం!



ఉపరాష్ట్రపతి ఎన్నికలలో ఎన్డీఏ అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌కు వైఎస్సార్ కాం గ్రెస్ పార్టీ(వైసీపీ) తమ మద్దతును ప్రకటించింది. ఈ నిర్ణయం అధికారిక కూటమికి మరింత బలం చేకూర్చనుంది. విపక్ష కూటమి తమ అభ్యర్థిని నిలబెట్టేందుకు సిద్ధమవుతున్న తరుణంలో వైసీపీ ఈ ప్రకటన చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. వైసీపీ లోక్‌సభ ఎంపీ మద్దిల గురుమూర్తి సోమవారం ఈ విషయాన్ని ధ్రువీకరించారు. మహారాష్ట్ర గవర్నర్‌గా ఉన్న రాధాకృష్ణన్‌కు తమ పార్టీ మద్దతు ఇస్తుందని వెల్లడించారు. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి మద్దతు కోరారు. ప్రస్తుతం వైసీపీకి లోక్‌సభలో నాలుగు, రాజ్యసభలో ఏడు కలిపి మొత్తం 11 మంది ఎంపీలు ఉన్నారు. వైసీపీ అధికారికంగా బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏలో లేదా విపక్ష 'ఇండియా' కూటమిలో భాగం కానప్పటికీ, రాష్ట్రంలో దాని ప్రధాన ప్రత్యర్థి టీడీపీ ఎన్డీఏలో కీలక మిత్రపక్షంగా ఉంది. పార్లమెంటు ఉభయ సభలలో ఎన్డీఏకు స్పష్టమైన మెజారిటీ ఉన్నందున, రాధాకృష్ణన్ విజయం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. ఏపీలో మారుతున్న సమీకరణాల వేళ చంద్రబాబు, పవన్ టార్గెట్‌గా జగన్ పోరాటం చేస్తున్నారు. 2029 ఎన్నికల వ్యూహాల్లో భాగంగా ఇప్పటి నుంచే జగన్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అందులో భాగంగా ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో భాగంగా ఏపీలోని మూడు ప్రధాన పార్టీలు ఎన్డీఏ వైపే ఉండడం గమనార్హం. ఈ లెక్కలు భవిష్యత్ సమీకరణాలకు కీలకం కానున్నాయి. దీంతో, రానున్న రోజుల్లో ఏపీలో రాజకీయం మరింత ఆసక్తి కరంగా మారే అవకాశం కనిపిస్తోంది.

## సూట్ కేసులో మలమూత్రాలు!..

### పుతిన్ సిబ్బంది హైటెక్ ప్లాన్!!

**అమరావతి, :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ల మధ్య అలస్కాలో జరిగిన సమావేశం అనేక చర్చలకు దారితీసింది. అయితే ఈ భేటీ సందర్భంగా వెలుగులోకి వచ్చిన ఒక ఆసక్తికరమైన అంశం ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. పుతిన్ తనతో పాటు 'పూప్ సూట్‌కేస్'(మల-మూత్రం సూట్‌కేస్) తీసుకెళ్లారని ఫ్రాన్స్ పత్రిక 'ప్యారిస్ మ్యాచ్' ఒక కథనాన్ని ప్రచురించింది. ఈ కథనం వెనుక ఉన్న భయాలు, ఊహాగానాల గురించి మరింత వివరంగా తెలుసుకుందాం. భయం వెనుక అసలు కారణం ఏమిటి? వ్లాదిమిర్ పుతిన్ మలమూత్రం సూట్ కేసు వెంట తీసుకువెళ్లడం వెనుక ఉన్న ప్రధాన కారణం తన వ్యక్తిగత ఆరోగ్య సమాచారం విదేశీ గూఢచార సంస్థలకు లభించకుండా చూసుకోవడమే. పుతిన్ ఫెడరల్ ప్రొటెక్షన్ సర్వీస్ (%ఖీూా%) అధికారులు ఆయన విదేశీ పర్యటనలో ఉన్నప్పుడు ఆయన మల-మూత్రాన్ని ఒక ప్రత్యేక బ్యాగ్‌లో సేకరించి, తిరిగి రష్యాకు తీసుకువెళ్తారని ఆ నివేదిక పేర్కొంది. ఈ చర్య ఆయన ఆరోగ్యానికి సంబంధించిన బయోలాజికల్ డేటాను విదేశీ సంస్థలు సేకరించకుండా నిరోధించడానికి ఉద్దేశించబడింది. విదేశీ గూఢచార సంస్థలు ఒక వ్యక్తి మలమూత్రాన్ని విశ్లేషించడం ద్వారా వారి జీవనశైలి, వారు తీసుకునే ఆహారం, ఆరోగ్య సమస్యలు, చికిత్స గురించి కీలకమైన సమాచారాన్ని తెలుసుకోగలుగుతాయని నిపుణులు చెబుతున్నారు. పుతిన్ ఆరోగ్యంపై గత కొన్ని ఏళ్లుగా అనేక ఊహాగానాలు, ముఖ్యంగా ఆయనకు పార్కిన్సన్ వ్యాధి ఉందని వార్తలు వస్తున్న నేపథ్యంలో ఈ జాగ్రత్తలు మరింత ప్రాధా న్యత సంతరించుకున్నాయి. నవంబర్ 2024లో కజకిస్తాన్ రాజధాని అస్తానాలో జరిగిన ఒక విలేకరుల సమావేశంలో ఆయన కాళ్లు వణకడం గమనించిన తర్వాత ఈ అనుమానాలు మరింత బలపడ్డాయి.

## బీజేపీకి దీటైన అభ్యర్థిని రంగంలోకి దించుతున్న ఇండియా కూటమి!



**అమరావతి :** ఉపరాష్ట్రపతి ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో అధికార ఎన్డీఏ కూటమి మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను తమ అభ్యర్థిగా ప్రకటించి రాజకీయ వాతావరణాన్ని వేడెక్కించింది. ఈ నేపథ్యంలో విపక్ష ఇండియా కూటమి కూడా తమ అభ్యర్థి ఎంపికపై దృష్టి సారించింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. డీఎంకే రాజ్యసభ ఎంపీ తిరుచి శివను విపక్ష కూటమి అభ్యర్థిగా నిలబెట్టే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ ఎంపిక వెనుక ఉన్న వ్యూహాత్మక కారణాలను లోతుగా విశ్లేషిద్దాం. ఉపరాష్ట్రపతి ఎన్నికలలో ఇద్దరు అభ్యర్థులు ఒకే రాష్ట్రానికి చెందినవారు కావడం ఒక ఆసక్తికరమైన అంశం. ఎన్డీయే అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ తమిళనాడులోని కోయంబత్తూరుకు చెందినవారు. ఆయనను నిలబెట్టడం ద్వారా దక్షిణాదిలో తమ బలాన్ని పెంచుకోవాలని బీజేపీ భావిస్తోంది. ఈ వ్యూహాన్ని తిప్పికొట్టడానికి విపక్షం కూడా తమిళనాడు నుంచే ఒక అభ్యర్థిని ఎంచుకోవడం ద్వారా సమాధానాన్ని చెప్పాలని చూస్తోంది. తిరుచి శివ అభ్యర్థిత్వం ఖరారైతే, తమిళనాడు రాజకీయాలలో ఇది ఒక కీలక పరిణామంగా మారుతుంది. ఇది ఎన్డేయే 'దక్షిణ' వ్యూహాన్ని ఎదుర్కోవడానికి విపక్షానికి ఒక మంచి ఛాన్స్ ఇస్తుంది. అంతేకాకుండా, దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, కేరళ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల నుండి మద్దతు పొందేందుకు కూడా ఇది సహాయపడుతుంది. డీఎంకే పార్టీ కూడా తమ సొంత నాయకుడికి మద్దతు ఇవ్వడానికి పూర్తిగా సిద్ధంగా ఉంటుంది. ఇది కూటమి ఐక్యతను కూడా పెంచుతుంది. రాజకీయాల్లో కులం, మతం వంటివి ఎంతటి ప్రాధాన్యత కలిగి ఉంటాయో తెలిసిందే. తిరుచి శివ ఒక దళిత నాయకుడు కావడం విపక్షానికి మరింత బలం చేకూరుస్తుంది. ఎస్సీ, ఎస్టీ, ఇతర వెనుకబడిన వర్గాల ఓటర్లను ఆకర్షించడానికి ఇది ఒక మంచి అవకాశంగా పరిగణించవచ్చు. బీజేపీకి వ్యతిరేకంగా విపక్షం ఎంచుకున్న సామాజిక న్యాయం నినాదానికి ఇది మరింత బలాన్ని చేకూరుస్తుంది.

# తారక్ డ్రాగన్ కోసం స్పెషల్ హౌస్ సెట్..





## ప్రశాంత్ నీల్ అదిరిపోయే ప్లాన్..!

తెలుగు ప్రేక్షకులతోపాటు పాన్ ఇండియా ఆడియెన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నమోస్ట్ ఎవెయిటెడ్ ప్రాజెక్ట్ జూనియర్ ఎన్టీఆర్న టిస్తోన్న చిత్రం (వర్కింగ్ టైటిల్) కేజీఎఫ్ ఫేం ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇటీవలే వార్ 2 సినిమాతో ప్రేక్షకులను పలుకరించాడు తారక్. ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద మంచి కలెక్షన్లు రాబడుతోంది. ఇదిలా ఉంటే ఇప్పుడు తారక్ అభిమానుల కోసం అదిరిపోయే వార్త ఒకటి బయటకు వచ్చింది. అదేంటో తెలుసా..?ప్రశాంత్ నీల్‌తో చేస్తున్న సినిమా షూటింగ్ గురించే.. ఈ సినిమా కోసం రామోజీ ఫిలింసిటీలో భారీ సెట్ వేశారట. తాజా టాక్ ప్రకారం ప్రత్యేకంగా డిజైన్ హౌస్ సెట్‌ను వేయగా.. దీని కోసం ఏకంగా రూ.15 కోట్లు ఖర్చు పెట్టారన్న వార్త ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. అంతేకాదు డ్రాగన్ నెక్ట్స్ షెడ్యూల్ ఈ ఇంటిలోకి జరుగనుంది. నెల రోజులపాటు జరుగనున్న ఈ షెడ్యూల్ వినాయక చవితి తర్వాత మొదలు కానుందట. తారక్ సెప్టెం బర్ తొలి వారంలో సెట్స్‌లో జాయిన్ కానున్నట్టు సమాచారం. ఈ షెడ్యూల్‌లో ప్రశాంత్ నీల్ అండ్ టీం తారక్‌పై వచ్చే హై వోల్టేజీ యాక్ష న్ సన్నివేశాలను చిత్రీకరించనున్నారట. పీరియాడిక్ యాక్షన్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం 2026 జూన్ 25న విడుదల కానుంది.చాలా కాలంగా అప్‌డేట్ కావాలని ఎదురుచూస్తున్న అభిమా నుల్లో ఈ వార్త ఖచ్చితంగా గుడ్‌న్యూస్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. పాన్ ఇండియా యాక్షన్ డ్రామా నేపథ్యంలో రాబోతున్న ఈ చిత్రాన్ని టాప్ ప్రొడక్షన్ హౌస్ మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తోంది.



# ట్విస్ట్‌తో ఓటీటీలోకి పవన్ కల్యాణ్ హరిహరవీరమల్లు..

## ఇంతకీ ఏం మార్పులు చేశారో తెలుసా..?

టాలీవుడ్ యాక్టర్ పవన్ కల్యాణ్టై టిల్ రోల్ పోషించిన చిత్రం హరిహర వీరమల్లు జ్యోతికృష్ణ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం రెండు పార్టులుగా తెరకెక్కుతుండగాహరిహరవీరమల్లు పార్ట్-1జులై 24నప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గావిడుదలైం ది. అయితే భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద అభిమానులను నిరాశపరిచింది. సినిమాలో వచ్చే కొన్ని సన్నివేశాలపై భారీ ఎత్తున ట్రోల్స్ వెల్లువెత్తాయి. కాగా థియేటర్లలో అంతగా ఇంప్రెస్ చేయలేకపోయిన ఈ చిత్రం ఓటీటీలో తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రెడీ అయింది.కేవలం నాలుగు వారాల వ్యవధిలోనే ఓటీటీలోకి ఎంట్రీ ఇచ్చింది హరిహరవీరమల్లు. ఈ మూవీ ప్రస్తుతం పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ అవుతోంది. కాగా పలు మార్పులతో ఓటీటీ వెర్షన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు మేకర్స్. ఓటీటీ మూవీ లవర్స్ కోసం కొన్ని సన్నివేశాలను ట్రిమ్ చేశారు. వీఎఫ్ఎక్స్ హార్స్ రైడింగ్ సెకండాఫ్‌లో పవన్ కల్యాణ్ విల్లు ఎక్కుపెట్టే సన్నివేశాలపై ప్రేక్షకులు, అభిమానుల పెద్ద ఎత్తున ట్రోల్స్ వచ్చిన విషయం తెలిసిందే.తుఫాను వచ్చే సమయంలో వారి మధ్య జరిగే ఘర్షణకు సంబంధించిన సీన్లను తీసివేశారట. ఓటీటీ వెర్షన్‌లో ఈ సన్నివేశాలను పూర్తిగా తొలిగించారని ఇన్‌సైడ్ టాక్. కొత్త వెర్షన్ ప్రకారం అసుర హననం పాట తర్వాత పార్ట్ 2 అనౌన్స్‌మెంట్‌తో సినిమా ముగియనుంది. బాబీ డియోల్‌తో ఎదురుపడే సన్నివేశాలు, సైక్లోన్ ఫైట్ సహా 15 నిమిషాలు ఓటీటీ వెర్షన్‌లో తీసేశారని ఫిలింనగర్ సర్కిల్ సమా చారం. ఈ కట్స్ తీసేయగా ప్రస్తుతం హరిహరవీరమల్లు ఓటీటీ రన్‌టైం 2 గంటల 33 నిమిషాలన్నమాట. మరి ఓటీటీలో ఎలాంటి ఇంప్రెషన్ కొట్టేస్తుందో చూడాలి.పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కిన ఈ మూవీలో ఇస్మార్ట్ భామ నిధి అగర్వాల్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించింది. లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందించాడు. ఈ మూవీని ఏఎం రత్నం సమర్పణలో మేఘ సూర్య ప్రొడక్షన్ బ్యానర్‌పై ఏ దయాకర్‌రావు నిర్మించారు.

## బాక్సాఫీస్ దగ్గర ధమాల్.. ఓటీటీలో వీరమల్లు తుఫాన్..!



పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన పీరియడిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'హరిహర వీరమల్లు' బాక్సాఫీస్ దగ్గర అనుకున్న స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోయింది. ఈ సినిమాలో పవన్ కళ్యాణ్ పవర్‌ప్యాక్డ్ పర్ఫార్మెన్స్‌తో ఆకట్టుకోగా ఈ చిత్రాన్ని క్రిష్, జ్యోతికృష్ణ డైరెక్ట్ చేశారు. ఇక ఈ సినిమా తాజాగా అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఓటీటీ స్ట్రీమింగ్‌కు వచ్చింది. ఈ సినిమాకు ఓటీటీలో ప్రేక్షకుల నుంచి సాలిడ్ రెస్పాన్స్ దక్కుతోంది.ఈ చిత్రం అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఇండియాలోనే నెంబర్ 1 స్థానంలో ట్రెండ్ అవుతోంది. థియేటర్లలో ధమాల్ అన్న ఈ సినిమా ఇప్పుడు ఓటీటీలో రిలీజ్ అయిన రోజే టాప్ 1 స్థానాన్ని దక్కించుకోవడం విశేషం. దీంతో వీరమల్లు టీమ్ సంతోషం వ్యక్తం చేస్తుంది.ఈ సినిమాకు వస్తున్న ట్రెమెండస్ రెస్పాన్స్‌తో ఈ సినిమా మున్ముందు ఎలాంటి రెస్పాన్స్ అందుకుంటుందా అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. ఈ సినిమాలో నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటించగా బాబీ డియోల్ విలన్ పాత్రలో నటించారు.

# ఎస్ఎస్ రాజమౌళి కొత్త ప్రయోగం..

గ్లోబల్ స్టార్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి సినిమా అంటే విజువల్స్ ఎలా ఉంటాయో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. జక్కన్న వీఎఫ్ఎక్స్ పార్ట్ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లేలా ఉంటుంది. అందుకు మగధీర, ఈగ, బాహుబలి, ఆర్ఆర్ఆర్ సినిమాలే ఉత్తమ ఉదాహరణగా చెప్పొచ్చు. అందుకే భారతీయ సినీ చరిత్రలో జక్కన్న సినిమాలు చాలా ప్రత్యేకమైనవిగా నిలిచాయి. కాగా ఇప్పుడిక ఎస్ఎస్ఎంబీ 29 సినిమాతో బిజీగా ఉన్నాడు ఎస్ఎస్ రాజమౌళి. మహేశ్ బాబు లీడ్ రోల్‌లో నటిస్తోన్న ఈ మూవీ ఆఫ్రికన్ అడ్వెంచరస్ ప్రాజెక్ట్‌గా రాబోతుంది.భారత్‌లో కొన్ని కీలక షెడ్యూల్స్ షూట్ చేసిన జక్కన్న టీం నెక్ట్స్ షెడ్యూల్ కోసం ప్రస్తుతం నైరోబిలో ల్యాండ్ అయింది. ఇప్పటికే మూవీ హీరోయిన్ ప్రియాంకా చోప్రా ప్రైడ్ ల్యాండ్స్ (సింహాలకు ఆవాసమైన సవన్నా భూభాగం)లో సఫారీ రైడ్ చేసి హైనా, హిప్పోపొటామస్, ఆస్ట్రిచ్, ఆఫ్రికన్ బఫెలో లాంటి వాటిని కెమెరాలో బంధించి ఆ ఫొటోలను ఇన్ స్టాగ్రామ్‌లో షేర్ చేసింది. ఇక ఈ ఫొటోలను చూసిన నెటిజన్లు, మూవీ లవర్స్ సినిమా గురించి ఆసక్తికర చర్చ తెరపైకి తెచ్చారు. ఇంతకీ విషయమేంటంటే ఈ సినిమా కోసం జక్కన్న సీజీ వర్క్‌కు బదులు కొత్త మెథడ్‌ను ఫాలో అవుతున్నాడని చర్చించుకుం టున్నారు. సినిమాలోని సన్నివేశాలను రియలిస్టిక్‌గా చూపించి అభిమానులను సరికొత్త ప్రపంచంలోకి తీసు కెళ్లేందుకు జక్కన్న టీం నైరోబీలోని జంగిల్‌లో సఫారీ రైడ్ చేస్తూ ఇలా జంతువులను షూట్ చేస్తున్నారని అంటున్నారు. సెరెంగెటి నేషనల్ పార్క్ టాంజానియాతోపాటు ఇతర లొకేషన్లలో నెక్ట్స్ షెడ్యూల్ కొనసాగనుంది. అంటే సీజీకి బదులు కెమెరాతో తీసిన రియలిస్టిక్ సీన్లను సినిమాలో చూపించనున్నాడన్న మాట.మేకర్స్ ముందుగా చెప్పిన ట్టుగానే ఈ చిత్రం అద్భుతమైన గ్లోబల్ యాక్షన్ అడ్వెంచరస్ డ్రామా కాబోతుందని తాజా వార్తలు మరోసారి హింట్ ఇచ్చేస్తున్నాయి.



ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో మాలీవుడ్ స్టార్ యాక్టర్ పృథ్వీరాజ్ సుకుమారన్ మరో కీలక పాత్రలో నటిస్తున్నాడు. మరి రాబోయే రోజుల్లో ఎస్ఎస్ రాజమౌళి టీం నుంచి ఏదైనా అధికారిక అప్‌డేట్ వస్తుందేమో చూడాలి.


## సోషల్ మీడియాలో ఫేక్ అకౌంట్స్..

### వార్నింగ్ ఇచ్చిన మహేశ్ బాబు కూతురు సితార



సూపర్‌స్టార్ మహేశ్‌బాబు కుమార్తె సితార ఘట్టమనేని తన పేరుతో సోషల్ మీడియాలో చలామణి అవుతున్న నకిలీ ఖాతాలపై తీవ్రంగా స్పందించారు. తన అభిమానులు, శ్రేయోభిలాషులు, స్నేహితులు అప్రమత్తంగా ఉండాలని కోరుతూ ఆమె ఒక ప్రకటన విడుదల చేసింది. ఇన్‌స్టాగ్రామ్‌లో తప్ప ఇతర ఏ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో కూడా అఫీషియల్ అకౌంట్ లేదని సితార స్పష్టం చేసింది. ఈ విషయంపై సితార తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్ట్ పెట్టింది.


## గుండెల్ని హత్తుకునేలా 'కన్యాకుమారి' ట్రైలర్




ప్రముఖ నటి మధు శాలిని ప్రెజెంటర్‌గా రూపొందించిన గ్రామీణ ప్రేమకథ చిత్రం 'కన్యాకుమారి'. సృజన్ అట్టాడ దర్శకత్వం వహించి ప్రొడ్యూస్ చేసిన ఈ చిత్రంలో గీత్ సైని, శ్రీచరణ్ రాచకొండ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి విడుదలైన ట్రైలర్ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి రేకెత్తించింది.ఈ కథ శ్రీకాకుళం గ్రామీణ వాతావరణంలో సాగుతుంది. రైతుగా మారాలని కలలుకనే తిరుపతి తన లక్ష్యాన్ని సాధించుకుంటాడు. మరోవైపు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావాలని ఆశపడే కన్యాకుమారి పరిస్థితుల వల్ల బట్టల దుకాణంలో సేల్స్‌గర్ల్‌గా పనిచేస్తుంది. విభిన్న ఆశయాలు, కుటుంబ వ్యతిరేకత మధ్య ఇద్దరి ప్రేమకథ మనసుకు హత్తుకునేలా ఉంటుందని ఈ ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది.సృజన్ అట్టాడ అందించిన సహజమైన కథనంతో పాటు, శివ గాజుల, హరిచరణ్ కె తీసిన అద్భుతమైన దృశ్యాలు రవి నిడమర్తి అందించిన హృద్యమైన సంగీతం సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. గీత్ సైని, శ్రీచరణ్ రాచకొండ జంట మధ్య కెమిస్ట్రీ ప్రేక్షకులను మరింత ఆకట్టుకునేలా చేస్తుందని ఈ ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది. ఇక ఈ సినిమాను ఆగస్టు 27న థియేటర్లలో గ్రాండ్ రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు.

## తోపు హీరోలతో బిజీగా ఉన్న ఏకైక హీరోయిన్..!

బాలీవుడ్ స్టార్ బ్యూటీ దీపికా పదుకొనే ప్రస్తుతం వరుసబెట్టి సినిమాలు చేస్తోంది. ప్రభాస్‌తో సందీప్ రెడ్డి వంగ దర్శకత్వంలో 'స్పిరిట్' చిత్రంలో నటించాల్సిన ఆమె కొన్ని కారణాల వల్ల ఆ చిత్రం నుంచి తప్పుకుంది. ఇక ఆ తర్వాత ఆమె రూ.1000 కోట్ల కు పైగా వసూళ్లు సాధించిన ఇద్దరు స్టార్ హీరోల సినిమాలను ఒకే చేసి సర్‌ప్రైజ్ చేసింది.బాలీవుడ్ కింగ్ ఖాన్ షారుక్ ఖాన్‌తో దీపికా నటిస్తున్న 'కింగ్' సినిమా ఇప్పటికే షూటింగ్ ప్రారంభించుకుంది. 2026లో విడుదల కానున్న ఈ చిత్రం, పఠాన్ జవాన్ తర్వాత బాలీవుడ్‌లో ఈ జోడీ క్రేజీగా మారింది. దీంతో పాటు కింగ్ చిత్రం బాలీవుడ్‌లో మోస్ట్ అవైటెడ్ చిత్రాల్లో ఒకటిగా మారడంతో ఈ సినిమాలో షారుక్ ఎలా ఉండబోతున్నాడా.. దీపికాతో ఆయన ఎలాంటి



స్క్రీన్ ప్రెజెన్స్ ఇస్తాడా అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు.ఇక దీపికా మరో క్రేజీ ప్రాజెక్ట్ AA22A6. అట్లీ దర్శకత్వంలో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా నటిస్తున్న ఈ సినిమా ఇండియాలో ఉన్న క్రేజీ ప్రాజెక్ట్‌లలో ఒకటి. ఈ సినిమాలో అల్లు అర్జున్ మూడు విభిన్న పాత్రల్లో కనిపించను న్నాడని తెలుస్తోంది.

అయితే దీపికా యోధురాలి లుక్‌లో కనిపించనుండగా, ఈ పాత్ర కోసం ప్రత్యేక శిక్షణ, భారీ కాస్ట్యూమ్స్ సిద్ధం చేస్తున్నారట మేకర్స్. రష్మిక మందన్న, జాన్వీ కపూర్, మృణాల్ ఠాకూర్ వంటి స్టార్ క్యాస్ట్ ఈ సినిమాలో నటిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ ప్రాజెక్ట్ 2027లో విడుదల కానుంది. వరుసగా ఇద్దరు 1000 కోట్ల హీరోలతో పనిచేస్తున్న ఏకైక హీరోయిన్‌గా దీపికా తనదైన మార్క్ వేసుకుంది.

## 'కూలీ'ని ఖూనీ చేసింది ఆయనేనా..?

తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన లేటెస్ట్ మూవీ కూలీ ఇటీవల బాక్సాఫీస్ దగ్గర రిలీజ్ అయి సందడి చేస్తుంది. ఈ సినిమాను దర్శకుడు లోకేష్ కనగరాజ్ డైరెక్ట్ చేయగా రజినీ పవర్‌ఫుల్ పాత్రలో నటించాడు. ఇక ఈ సినిమాలో పలువురు స్టార్స్ కూడా నటించారు. భారీ అంచనాల మధ్య రిలీజ్ అయిన ఈ సినిమా అనుకున్న స్థాయిలో అయితే ప్రేక్షకులను మెప్పించలేకపోయిందని చెప్పాలి. ఈ సినిమా కథ చాలా చప్పగా ఉండటమే దీనికి కారణమని అభిమానులు కామెంట్ చేస్తున్నారు.అయితే, కూలీ చిత్రం ట్రాక్ తప్పడానికి రజినీకాంత్ ముఖ్య కారణమని కోలీవుడ్ వర్గాల్లో ఓ వార్త జోరుగా చక్కర్లు కొడుతోంది. ఈ సినిమా కోసం లోకేష్ కనగరాజ్ రజనీకాంత్ పాత్ర చుట్టూ తిరిగే ఒక ఆసక్తికర థ్రిల్లర్ కథను వినిపిం చాడట. అయితే రజనీ ఆ ప్రపోజల్‌ను తిరస్కరిoచి, జైలర్ తరహా స్క్రిప్ట్ రాయమని లోకేష్ కనగరాజ్‌ను కోరారు. దాంతో లోకేష్ కనగరాజ్ కూలీ స్క్రిప్ట్‌పై రీవర్క్ చేశాడట. ఈ సినిమా కోసం ఆయన ఉపేంద్ర, అమీర్ ఖాన్ లాంటి



నటులను తెప్పించాల్సి వచ్చింది. అ యితే వారి పాత్రలు సినిమాలో పెద్దగా ప్రభా వం చూపలేకపోయాయి.సినిమా భారీ ఓపె నింగ్‌తో ప్రారంభమైనా ప్రేక్షకుల నుంచి మిక్స్‌డ్ రివ్యూలు వచ్చాయి. లోకేష్ కనగరాజ్ మొదటి కథనే తెరకెక్కించి ఉంటే ఫలితం వేరేలా ఉం డేదేమో అని అభిమానులు భావిస్తున్నారట. దీం తో రజనీకాంత్ కారణంగా ఫ్యాన్‌బాయ్ లోకేష్ తన ప్లాన్ మార్చుకోవాల్సి వచ్చిందని వారు సోషల్ మీడియాలో కామెంట్స్ చేస్తున్నారు.